RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 320 పేజీలు - 04 వెల - 05/- బుధవారం 31 జూలై 2024

# అటవీ శాఖ ఉద్యోగులపై దాడి చేస్తే చర్యలు తప్పవు.!

- ●డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.
- ●పల్నాడు జిల్లాలో అటవీశాఖ ఉద్యోగులపై స్మగర్ల దాడి.
- ●ఇద్దరు అధికారులకు గాయాలు.
- ●ఘటనను తీవ్రంగా ఖండించిన పవన్ కల్యాణ్.



ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 30: వన్యప్రాణులను అక్రమ రవాణా చేసినా, అటవీ శాఖ ఉద్యోగులపై దాడి చేసినా చర్యలు తప్పవని ఏపీ డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు ఎక్కడ జరిగినా చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విజయపురి సౌత్ రేంజిలో అటవీ ఉద్యోగులపై దాడి ఘటన పట్ల పవన్ తీవ్రంగా స్పందించారు. ఈ దాడిని ఖండిస్తున్నట్టు తెలిపారు. దీనిపై ఆయన పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడారు. వన్యప్రాణుల అక్రమ రవాణాదారుల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరముందని తెలిపారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ల వద్ద జంతువుల అక్రమ రవాణాదారులు అటవీశాఖ సిబ్బందిపై దాడి చేసి గాయపర్చడం తెలిసిందే. స్మగర్ల దాడిలో రేంజి ఆఫీసర్ సత్యనారాయణరెడ్డి, బీట్ ఆఫీసర్ మహేశ్ బాబులకు గాయాలయ్యాయి. కాగా, జంతువుల స్మగ్లర్లు అందరూ ఒకే కుటుంబానికి చెందినవారని తెలుస్తోంది.

## గిరిజన మహిళల సౌకర్యం కోసం

# మళ్లీ గర్భిణీ వసతి గృహాలు



- ● గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలు కనిపించకూడదు.!
- ● ట్రైకార్, జిసిసి, ఐటిడిఎలను యాక్టివేట్ చేయండి.
- ● గిరిజన సంక్షేమ శాఖపై సమీక్ష లో ముఖ్యమంత్రి
- ● నారా చంద్రబాబు నాయుడు.

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 30: రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో రానున్న రోజుల్లో డోలీ మోతలు కనిపించకూడదు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ వ్యవస్థల విధ్వంసంతో గిరిజన ప్రజల జీవన ప్రమాణాలు దారుణంగా పడిపోయాయని ముఖ్యమంత్రి అన్నారు. అవసరమైన మౌళిక వసతులు కల్పించడం ద్వారా, ఫీడర్ అంబులెన్స్ లను తిరిగి ప్రవేశ పెట్టడం ద్వారా రానున్న రోజుల్లో గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలు లేకుండా చూడాలని అన్నారు. అలాగే నెలలు నిండిన గర్భిణీల కోసం గతంలో తెలుగు దేశం ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన గర్భిణీ వసతి గృహాలు మళ్లీ ప్రారంభించాలన్నారు. తద్వారా గిరిజన మహిళలకు మేలు జరుగుతుందని చంద్రబాబు చెప్పారు.గిరిజన సంక్షేమ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈమేరకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.మంగళవారం రాష్ట్ర సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖపై జరిపిన సమీక్షలో గిరిజనులకు విద్యా, వైద్యం, సంక్షేమ పథకాలు అందించడంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై సియం సమీక్షించారు.

మిగతా 2లో

## ఆగస్టు2న కేబినెట్ భేటీ.. కీలక అంశాలపై చర్చ.!



ఆంధ్ర ప్రగతి అమరావతీ జులై 30: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఆగస్టు 2న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. సచివాలయంలో మొదటి బ్లాక్లో ఉదయం 11 గంటలకు భేటీ ప్రారంభమవుతుంది. ఈ సమావేశంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు, వాలంటీర్ వ్యవస్థ, భూ అక్రమాల పై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# కష్టాలు చెప్పుకునేందుకు

## "ప్రజాదర్బార్" కు తరలివస్తున్న ప్రజలు.!

- ●బాధితుల కన్నీళ్లు తుడుస్తూ నేనున్నానంటూ
- ● భరోసా ఇస్తున్న యువనేత.
- ●వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇబ్బందులు
- ●ఎదుర్కొన్నామని బాధితుల ఆవేదన.
- ●20వ రోజు ప్రజాదర్బార్ కు భారీగా తరలిరాక.



ఆంధ్ర ప్రగతి అమరావతి జులై 30: సమస్యలు పరిష్కారం కాక వైసీపీ ఐదేళ్ల పాలనలో కష్టాలు, కన్నీళ్లతో కాలం వెళ్లదీసిన బాధితులకు విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ "ప్రజాదర్బార్" భరోసా ఇస్తోంది. ప్రజల విన్నపాల పట్ల తక్షణమే స్పందిస్తున్న యువనేత.. పలు సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నారు. ప్రజా ప్రభుత్వంలో ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని.. ప్రతిఒక్కరికి అండగా ఉంటామంటూ బాధితులకు భరోసా ఇస్తున్నారు. ప్రజల వినతులపై వారానికోసారి సమీక్ష నిర్వహించనున్నట్లు ఇప్పటికే మంత్రి వెల్లడించారు.**మిగతాది 2లో...**

## ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తెకు హైకోర్టులో ఎదురుదెబ్బ.!



2లో

## ఏపీలో ఆరోగ్యశ్రీ పథకాన్ని నిలిపివేస్తున్నారా..?

ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల



# జగన్ కు ప్రతిపక్ష హోదాపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ..!

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 30: ప్రతిపక్ష హోదా కోసం వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఓ రేంజ్ పోరాటమే చేస్తున్నారు. ఇప్పటికే తనకు ప్రతిపక్ష హోదా కల్పించాలంటూ స్పీకర్‌కు లేఖ రాసి తిరస్కరణకు గురైన జగన్ ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టును కూడా ఆశ్రయించారు.తనకు ప్రతిపక్ష హోదా కల్పించేలా అసెంబ్లీ స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. జగన్ పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్తానం ఈరోజు విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా జగన్ తరపు న్యాయవాది తమ వాదనలు వినిపించారు. అసెంబ్లీలో విపక్ష పార్టీకి ఉన్నది ఒకే ఒక్క పార్టీ అని, అప్పుడు ఆ పార్టీనే ప్రతిపక్షంగా గుర్తించాలని, ఆ పార్టీ అధినేతకు ప్రతిపక్ష నేత హోదా కల్పించాలని జగన్ తరపు న్యాయవాది వివరించారు. విచారణలో భాగంగా.. ప్రతిపక్ష నేతగా గుర్తించాలని శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వైఎస్ జగన్.. రిప్రజెంటేషన్ ఇచ్చారా అని న్యాయమూర్తి ప్రశ్నించారు.




కాగా జూన్ 24న జగన్ తన రిప్రజెంటేషన్‌ను స్పీకర్‌కు అందించినట్లు జగన్ తరపు న్యాయవాది వినిపించారు. వారి వాదనలు విన్న అనంతరం దీనిపై తమ సమాధానం చెప్పాలని, కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కోరుతూ అసెంబ్లీ సెక్రటరీ, స్పీకర్ కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది

**మిగతాది 2లో...**

# ఏపీలో పోలీసులకు వీక్లీ ఆఫ్ లు .!

## -హోంమంత్రి అనిత.



ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 30: వైసీపీ ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైందని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. పోలీసుల సంక్షేమం, గంజాయి నివారణపై ఎస్పీలతో మంత్రి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. పోలీసు అంటే భయం కాదు.. భద్రత అనే భరోసా రావాలవని అన్నారు. పోలీసులకు వీక్ ఆఫ్ అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో సరెండర్ సెలవులు కూడా ఇవ్వకుండా చేశారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంలో సరెండర్ లీవులకు నిధులిస్తామని స్పష్టం చేశారు.పోలీసు విభాగం ఇన్వెస్టిగేషన్ టూల్ లేవని.. ఎక్కడ ఏం జరిగిన దాని వెనుక గంజాయి ఉందని హోంమంత్రి అనిత ఆరోపించారు. ఈ ఐదు జిల్లాల్లో గంజాయి నియంత్రణకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏజెన్సీలో గంజాయి పంట మీద సీసీ కెమెరాలతో నిఘా పెట్టమని చెప్పారు. గంజాయి వివరాలు ఇస్తే వారికి బహుమతి ఇస్తామని ప్రకటించారు. అన్ని జిల్లాల్లో కూడా ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని వెల్లడించారు.ఏపీలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైందని హోంమంత్రి అనిత అన్నారు. జగన్ ప్రభుత్వంలో అధునాత పరికరాలు, వాహనాల నిర్వహణ సరిగ్గా లేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో చివరికి పోలీసుల భద్రత కోసం పక్క రాష్ట్రం నుంచి తుపాకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పోలీసు అకాడమీ లేని రాష్ట్ర ఏపీనే అని చెప్పారు. పోలీసు వ్యవస్థ మళ్లీ పటిష్టంగా పనిచేయాలని సూచించారు.సోషల్‌మీడియాలో కొంతమంది హోంశాఖపై, వ్యక్తిగతంగా తనపై బురద జల్లుతున్నారని హోంమంత్రి అనిత విమర్శించారు. వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. తమ ప్రభుత్వం వచ్చాక పోలీసు శాఖ పనితీరు మీద, వైసీపీ ప్రభుత్వ విఫల విధానాలపై త్వరలోనే పూర్తి సమాచారంతో మీడియా సమావేశం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పోలీసులకు సంక్షేమంపై దృష్టి పెట్టామని తెలిపారు.

# కష్టాలు చెప్పుకునేందుకు "ప్రజాదర్బార్" కు తరలివస్తున్న ప్రజలు.!

*(మొదటి పేజీ తరువాయి)*

దీంతో తమ సమస్యలను, కష్టాలను విన్నవించేందుకు "ప్రజాదర్బార్" కు వేలాదిగా తరలివస్తున్నారు. ఉండవల్లిలోని నివాసంలో యువనేతను నేరుగా కలిసి తమ కష్టాలను చెప్పుకుంటున్నారు. 20వ రోజు "ప్రజాదర్బార్" కార్యక్రమానికి వేకువజాము నుంచే బారులు తీరారు. ప్రతి ఒక్కరిని నేరుగా కలిసిన మంత్రి.. వారి నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మంగళగిరి నియోజకవర్గం పెద్ద కొండూరుకు చెందిన పి.మాచమ్మ యువనేతను కలిసి తమ సమస్యను విన్నవించారు. గ్రామంలో తనకున్న 60 సెంట్ల భూమి ప్రభుత్వ భూమిగా నమోదైందని తెలిపారు. అడంగల్ లో రికార్డు సవరణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తనకు మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మార్కెట్ యార్డులో స్వీపర్ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని జి.వీరమ్మ కోరారు. ఆమె విజ్ఞప్తిని పరిశీలించిన యువనేత.. తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.మంగళగిరి నియోజకవర్గం శృంగారపురానికి చెందిన మొవ్వా చంద్రశేఖర్ రావు, పొట్లూరి గౌతమ్, కావూరి నరసింహారావు నారా లోకేష్ ను కలిశారు. విశాఖ మధురవాడలో నేషనల్ హైవే-5, బీచ్ రోడ్డు విస్తరణలో తమ భూములు కోల్పోయామని, తగిన నష్టపరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం సిద్ధాపురానికి చెందిన ఇరుగుదిండ్ల నాగమ్మ మంత్రి నారా లోకేష్ ను కలిశారు. గ్రామంలో దశాబ్దాలుగా తన భర్త పేరుపై ఉన్న 5.73 ఎకరాల డి-పట్టా భూమిని వైసీపీ నేతలు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. తప్పుడు దస్తావేజులతో నకిలీ పాసు పుస్తకాలు, రెవెన్యూ రికార్డులు సృష్టించారని తెలిపారు. కబ్జాదారులపై తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. సదరు ఫిర్యాదుపై స్పందించిన మంత్రి.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కర్నూలు జిల్లా దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామానికి చెందిన వడ్డే తిరుపాలు మంత్రి లోకేష్ ను కలిశారు. 2014-19 మధ్య గ్రామంలో అంగన్ వాడీ పాఠశాల భవనం, సీసీ రోడ్డు, ప్రభుత్వ పాఠశాల మరుగుదొడ్లు నిర్మించానని తెలిపారు. వైకాపా ప్రభుత్వంలో బిల్లులు మంజూరుకాక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ప్రజాప్రభుత్వంలో బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. ఆర్టీసీలోని విజిలెన్స్, సెక్యూరిటీ విభాగంలో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న తమకు 11వ వేతన సవరణ ద్వారా జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని ఏపీఎస్ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత కానిస్టేబుళ్ల వేతనం తగ్గిందని యువనేత దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి తగిన న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఏపీ సీఆర్ డీఏలో పనిచేస్తున్న డ్రైవర్లు, అటెండర్లను వీజీటీఎం ఉడా కేడర్ లో ఉన్న రెగ్యులర్ పోస్టుల్లో నియమించాలని సిబ్బంది యువనేతను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న తెలుగు, హిందీ భాషోపాధ్యాయుల పదోన్నతులు, సర్వీసును కాపాడాలని సిబ్బంది మంత్రి లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.విజయనగరం జిల్లా రాజాం మండలం పొగిరి గ్రామానికి చెందిన వి.హేమలత నారా లోకేష్ ను కలిశారు. తమ 17 ఏళ్ల కుమారుడు రెండు నెలలుగా అదృశ్యమయ్యాడని, ఎంత వెతకినా జాడ కనిపించలేదని కన్నీటిపర్యంతమయ్యారు. కుమారుడు అదృశ్యంపై రాజాం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామన్నారు. తమ ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన యువనేత పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఎలాంటి ఆధారం లేని తమ కుటుంబానికి ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజయవాడ గొల్లపూడికి చెందిన మండవ వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. హెచ్ఐవీ, క్యాన్సర్ వ్యాధులతో బాధపడుతున్న తమకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన పరసా వెంకటలక్ష్మీ దంపతులు నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

# ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తెకు హైకోర్టులో ఎదురుదెబ్బ.!

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 30:
రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. విశాఖ జిల్లా భీమిలి బీచ్? వద్ద సముద్రానికి అతి సమీపంలో నిర్మించిన కాంక్రీట్ ప్రహారీగోడ కూల్చివేత విషయంలో స్టేటస్? కో ఇవ్వాలంటూ ఆమె చేసిన అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది.

ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులివ్వలేమని తేల్చిచెప్పింది. అక్కడి నిర్మాణాలను నిలుపుదల చేస్తూ, అక్రమ కట్టడాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సీజే నేతృత్వంలోని ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు అమల్లో ఉన్నంత కాలం తాము మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం సాధ్యం కాదని సింగిల్ జడ్జి స్పష్టం చేశారు. అవసరమైతే సీజే బెంచ్ వద్ద ఉన్న పిల్‌లో ప్రతివాదిగా చేరి గత ఉత్తర్వుల సవరణ కోసం అభ్యర్థన చేయవచ్చని పిటిషనర్‌కు సూచించారు. మరోవైపు నేహారెడ్డి వేసిన వ్యాజ్యంలో విశాఖ జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ప్రతివాదిగా చేరేందుకు అనుమతిచ్చారు. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. విచారణను వారం రోజులకు వాయిదా వేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. భీమిలి (భీమునిపట్నం) బీచ్ వద్ద సముద్రానికి సమీపంలో సీఆర్‌జడ్ (కోస్టల్ రెగ్యులేషన్ జోన్) నిబంధనలను ఉల్లంఘించి శాశ్వత నిర్మాణం చేపట్టడాన్ని సవాలు చేస్తూ మూర్తియాదవ్ సీజే ధర్మాసనం ముందు గతంలో పిల్ దాఖలు చేశారు. విచారణ జరిపిన కోర్టు.. తక్షణం నిర్మాణ పనులను నిలిపి వేయాలని ఉత్తర్వులిచ్చింది. యంత్రాలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించింది. కట్టడాల విషయంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. దీంతో భీమిలి బీచ్?కు సమీపంలో నిర్మించిన ప్రహరీగోడ కూల్చివేతకు విశాఖ జీవీఎంసీ సహాయ సిటీ ప్లానర్(జోన్-1) ఈ నెల 18న తుది ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ నేహారెడ్డి హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద ఇటీవల వ్యాజ్యం వేశారు. సింగిల్ జడ్జి ఈ వ్యాజ్యాన్ని ఇదే వ్యవహారంతో ముడిపడి ఉన్న సీజే బెంచ్ వద్ద ఉన్న పిల్‌తో జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు. ఈ నేపథ్యంలో నేహారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యం, మూర్తియాదవ్ దాఖలు చేసిన పిల్?పై సీజే బెంచ్ విచారణ జరిపింది. నేహారెడ్డి వేసిన వ్యాజ్యాన్ని సింగిల్ జడ్జి విచారించడమే సబబు అని అభిప్రాయపడింది. వ్యాజ్యాన్ని సింగిల్ జడ్జి వద్దకు పంపింది. దీంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్ సోమవారం ఈ వ్యాజ్యంపై విచారణ జరిపారు.

# జగన్ కు ప్రతిపక్ష హోదాపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ..!


*(మొదటి పేజీ తరువాయి)*

. కౌంటర్ దాఖలుకు మూడు వారాల గడువు ఇస్తున్నట్లు కూడా న్యాయస్థానం వెల్లడించింది. అనంతరం ఈ పిటిషన్ విచారణను వాడువారాలకు వాయిదా వేస్తున్నట్లు న్యాయస్థానం ప్రకటించింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి కేవలం 11 స్థానాలే వచ్చాన్న కారణం చూపుతూ ప్రతిపక్ష హోదా కల్పించడం లేదని, జగన్‌ను ప్రతిపక్ష నేతగా గుర్తించడం లేదని, ఈ విషయంపై ప్రశ్నిస్తే స్పీకర్ సమాధానం చెప్పకుండా విషయాన్ని సాగదీస్తున్నారని జగన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అసెంబ్లీ సీట్లలో 10శాతం సీట్లు రానందున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్షానికి ప్రధాన ప్రతిపక్ష హోదా రాదనే చర్చ జరుగుతోంది. భారత రాజ్యంగా ప్రకారం ఆర్టికల్-208 కింద ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ నోటిఫై చేసిన సభా ప్రవర్తనా నియమావళిలో పలానా సీట్లు వస్తేనే ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలనే విషయాన్ని ఎక్కడా చెప్పలేదన్న విషయాన్ని మీ ముందుకు తెస్తున్నాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎక్కడా ఈ నిబంధన పాటించలేదనే అంశాన్ని గుర్తుచేస్తున్నాను. 1984లో లోక్ సభలో 543 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ 30 ఎంపీ సీట్లను గెలుచుకుంది. సభలో 10శాతం సీట్లు లేకపోయినప్పటికీ అప్పుడు టీడీపీకి చెందిన పర్వతనేని ఉపేంద్రను ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించారు. 1994 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 294 సీట్లకు గాను కాంగ్రెస్ 26 సీట్లు మాత్రమే సాధించింది. 10 శాతం సీట్లు కాంగ్రెస్‌కు లేకపోయినప్పటికీ పి జనార్ధన్ రెడ్డిని ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించారు. 2015లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకు గాను బీజేపీ కేవలం 3సీట్లు సాధించినప్పటికీ ఆ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చారు. ఈ అంశాలన్నీ కూడా కేవలం ప్రజా ప్రయోజనాల రీత్యా మీ దృష్టికి తీసుకు వస్తున్నాను. ప్రజల తరపున అసెంబ్లీలో గొంతు విప్పడానికి తగిన సమయం లభించాలనే ఉద్దేశంతో ఈ లేఖ మీకు రాస్తున్నాను. అయితే ఇలాంటి పరిస్థితికి ఆస్కారం లేకుండా ఇప్పటికే అధికార కూటమి శతృత్వాన్ని ప్రదర్శిస్తోంది. ఈ నేపథ్యంలో నేను సభలో మాట్లాడాలనుకుంటే అది భారీ మెజార్టీ సాధించిన అధికార కూటమి దయమీద, నన్ను చచ్చేవరకూ కొట్టాలన్న స్పీకర్ గారి విచక్షణ మీదే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం సభలో ఉన్న పార్టీల సంఖ్యా బలాలనుదృష్టిలో ఉంచుకుని ఈలేఖను పరిశీలించాలి" అని ఏపీ అసెంబ్లీ స్పీకర్‌కు రాసిన లేఖలో వైఎస్ జగన్ పేర్కొన్నారు.

# జగన్ ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది.!

## - హెూంమంత్రి అనిత

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 30:
గత వైసీపీ ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని హెూంమంత్రి అనిత మండిపడ్డారు. పోలీసు విభాగాలకు అవసరమైన సౌకర్యాలు, ఇన్వెస్టిగేషన్ కు కావాల్సిన పరికరాలు ఏవీ లేవన్నారు. పోలీస్ అంటే భయం కాదు, పోలీస్ అంటే భద్రత అని భరోసా రావాలని ఆకాంక్షించారు మంత్రి అనిత. కూటమి ప్రభుత్వం నేర నియంత్రణ చేస్తుందని ఆమె చెప్పారు. విశాఖ పోలీస్ కమిషనరేట్ హాల్ లో మీడియాతో మాట్లాడారు హెూంమంత్రి అనిత. అంతకుముందు విశాఖ నుంచి అన్ని జిల్లాల ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు."గంజాయి నివారణ మీద సమీక్ష నిర్వహించాం. పోలీస్ సంక్షేమం మీద సమీక్ష నిర్వహించాం. పోలీసు విభాగంలో ఇన్వెస్టిగేషన్ టూల్స్ లేవు. ఎక్కడ ఏం నేరం జరిగినా దాని వెనుక గంజాయి ఉంది. ఈ ఐదు జిల్లాల్లో గంజాయి నియంత్రణకు కృషి



చేస్తున్నాం. ఏజెన్సీలో గంజాయి పంట మీద సీసీ కెమెరాలతో నిఘా పెట్టాం. గంజాయి నివారణపై మంత్రివర్గ ఉపసంఘం నియమించారు. హెూం మంత్రి, విద్యా శాఖ మంత్రి, గిరిజన శాఖ మంత్రి, అబ్కారీ మంత్రి కలిసి ఈ ఉపసంఘం పని చేస్తోంది. గంజాయి వివరాలు ఇస్తే వారికి బహుమతి ఇస్తాం. అన్ని జిల్లాల్లో ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం.మైనర్ బాలిక విషయంలో పోక్సో చట్టం అమలవుతోంది. మా ప్రభుత్వం వచ్చాక శాఖ పని తీరు మీద, గత ఐదేళ్ల ప్రభుత్వ విఫల విధానం మీద నేను మాట్లాడానికి సిద్ధంగా ఉన్నాను.

పోలీసుల సంక్షేమంపై దృష్టి పెట్టాం. పోలీస్ అంటే భయం కాదు, పోలీస్ అంటే భద్రత అనే భరోసా రావాలి. మా కూటమి ప్రభుత్వం నేర నియంత్రణ చేస్తుంది. మహిళా భద్రత మీద మరింత పటిష్టంగా పని చేస్తున్నాం. తిరిగి మళ్ళీ గాడిలో పెట్టడానికి కొంత సమయం పడుతుంది. పోలీసులకు వీకాఫ్ మీద పరిశీలిస్తాం. గత ప్రభుత్వంలో సరెండర్ లీవ్ లు ఇవ్వకుండా చేశారు. మా కూటమి ప్రభుత్వంలో సరెండర్ లీవులకు నిధులిస్తాం. చివరికి ఎన్నికల సమయంలో పక్క రాష్ట్రం నుంచి తుపాకులు తెచ్చుకున్నాం. పోలీసు అకాడమీ లేని రాష్ట్రం ఏపీనే. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి కట్టడానికి నిధులిస్తే కట్టడం ఇష్టం లేక మానేశారు. సోషల్ మీడియా మీద దృష్టి పెడతాం. వైసీపీ ప్రభుత్వ హయాంలో రఘురామకృష్ణరాజు, గౌతు శిరీష మీద రాజద్రోహం కేసులు పెట్టారు" అని రాష్ట్ర హెూంమంత్రి అనిత అన్నారు.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో యూ.ఎస్. కాన్సల్ జనరల్ భేటీ.



ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 30:
రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ తో యూ.ఎస్. కాన్సల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినందున అభినందనలు తెలియచేసి జ్ఞాపిక అందచేశారు. మంగళవారం ఉదయం మంగళగిరిలోని శ్రీ పవన్ కళ్యాణ్ నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జెన్నిఫర్ లార్సన్ నీ, ఆమె బృందాన్ని పవన్ కళ్యాణ్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులకు, అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టేందుకు ఉన్న అవకాశాలు చర్చకు వచ్చాయి. రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వంతో కూడిన ప్రభుత్వ పాలన ఉందనీ, పెట్టుబడులను ప్రోత్సహించే సానుకూల దృక్పథం తమ ప్రభుత్వంలో ఉందని ఉప ముఖమంత్రి తెలిపారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునే నైపుణ్యం కలిగిన యువత రాష్ట్రంలో ఉన్నారని, వారి ప్రతిభకు తగిన అవకాశాలు అందించడంలోనూ, ఉన్నత విద్యకు అమెరికా వెళ్ళేవారికీ తగిన సహకారం, మార్గనిర్దేశనం అందించాలని కోరారు. పర్యావరణహితమైన కార్యక్రమాలకు ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో యూ.ఎస్. కాన్సల్ పొలిటికల్, ఎకనామిక్స్ విభాగం చీఫ్ శ్రీ ఫ్రాంక్ టాలుటో, ఆ విభాగం ప్రతినిధులు శ్రీమాలి కారే, సిబప్రసాద్ త్రిపాఠి పాల్గొన్నారు.

# గిరిజన మహిళల సౌకర్యం కోసం మళ్లీ గర్భిణీ వసతి గృహాలు


*(మొదటి పేజీ తరువాయి)*

2014 నుంచి 2019 మధ్య అమల్లో ఉన్న పథకాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సియం చంద్రబాబు అభిప్రాయపడ్డారు.గిరిజన విద్యార్థుల కోసం తెచ్చిన ఎన్టీఆర్ విద్యోన్నతి,అంబేద్కర్ ఓవర్ సీస్ విద్యానిధి,బెస్ట్ అవెయిలబుల్ స్కూల్స్ పథకాలను నిర్వీర్యం చేశారని అన్నారు. అలాగే గిరిజనులకు వైద్యం కోసం తెచ్చిన ఫీడర్ అంబులెన్స్ లను కూడా లేకుండా చేశారని పేర్కొన్నారు. అరకు కాఫీ అమ్మకాలు, మార్కెటింగ్ పై సిఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాడు అరకు కాఫీ ని ప్రమోట్ చేసేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని, కానీ తరువాత వచ్చిన ప్రభుత్వం అరకు కాఫీతో పాటు, గిరిజన ఉత్పత్తుల అమ్మకాలపై దృష్టి పెట్టలేదని అన్నారు. ఈవిషయంలో సమగ్రమైన మార్పులు రావాలని గిరిజన ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉందని.....దాన్ని ఉపయోగించుకుంటే గిరిజనుల జీవితాల్లో మార్పులు తేవచ్చు అని సిఎం అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఎంతో సారవంతమైన భూములు ఉన్నాయని ఆ ప్రాంతాల్లో పకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. తేనె, హార్టికల్చర్, కాఫీని ప్రొత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయి అని అన్నారు. గంజాయి అనేది గిరిజన ప్రాంతాల్లో ఎక్కడా కనిపించకుండా చూడాలని సిఎం అధికారులను ఆదేశించారు. ట్రైకార్, జిసిసి, ఐటిడిఎలు పూర్తిగా యాక్టివేట్ కావాలని సిఎం అన్నారు. ఈ సంస్థల కార్యకలాపాల వేగం పెంచాలని సూచించారు. వచ్చే నెలలో జరిగే అంతర్జాతీయ గిరిజన దినోత్సవం ఘనంగా నిర్వహించాని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కేంద్రం గిరిజనుల కోసం అమలు చేసే పథకాల పై కసరత్తు చేసి....రాష్ట్రానికి నిధులు సాధించే ప్రణాళికలతో రావాలని అధికారులను సిఎం ఆదేశించారు. గిరిజనులు సాగుచేస్తున్న భూములు, ఆయా పంటలకు వస్తున్న ఆదాయం, అలాగే గిరిజన ఉత్పత్తుల, ఇతర పనుల ద్వారా తలసరి ఆదాయంపై సమగ్ర వివరాలతో రావాలని ముఖ్యమంత్రి సూచించారు.

# ఏపీలో ఆరోగ్యశ్రీ పథకాన్ని నిలిపివేస్తున్నారా..?

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 30: ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల కూటమి ప్రభుత్వంపై ప్రశ్నలు గుప్పించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలపై అనుమానాలను లేవనెత్తారు.ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ కార్డులు తీసుకోవాలని కేంద్రమంత్రి పెమ్మసాని చెబుతున్నారని గుర్తు చేస్తూ.. అంటే రాష్ట్రంలో ఇక ఆరోగ్య శ్రీ లేనట్టేనా? అని సందేహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకాన్ని నీరుగార్చాలని చూస్తున్నారా? అని ప్రశ్నించారు. ఒక్క ఆయుష్మాన్ భారత్ పథకాన్నే అమలు చేయాలని భావిస్తున్నారా? అని అడిగారు.ఏపీలో ఎన్డీయే ప్రభుత్వమే ఏర్పడింది. దీంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకాన్నే ఏపీలోనూ అమలు చేయాలని అనుకుంటున్నారా? రాష్ట్రంలో అమల్లో ఉన్న ఆరోగ్య శ్రీ పథకాన్ని నిలిపేయాలని ఆలోచిస్తున్నారా? అంటూ ఏపీపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అనుమానాలు వ్యక్తపరిచారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని నిర్వీర్యం చేయాలనే లక్ష్యంలో భాగంగానే ఈ పథకానికి నిధులు కేటాయించడం లేదా? అని ప్రశ్నించారు. అందుకే పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపులపై నిర్లక్ష్యం వహిస్తున్నారా? అని అడిగారు.బిల్లులు చెల్లించే ఈ ప్రభుత్వమే బిల్లులు రావడం లేదని సమాధానం చెబుతుండటాన్ని ఎలా అర్థం చేసుకోవాలని వైఎస్ షర్మిల ప్రశ్నలు కురిపించారు. ఇందుకు కేంద్రం నుంచి వచ్చే రూ. 5 లక్షలు మినహా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కేటాయింపులు జరపలేదని నిలదీశారు. అంటే.. రాష్ట్రంలో ఇక ఆరోగ్య శ్రీ వైద్య సేవలు ఉండవనే సూచనలు చేస్తున్నారా? అని పేర్కొన్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యలను ఎలా అర్థం చేసుకోవాలన్నారు. ఈ గందరగోళంపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకం కింద ఆస్పత్రులకు రూ.1,600 కోట్ల బకాయిలు పెండింగ్‌లో పెట్టిందని వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ స్థాయిలో బకాయిలు పేరుకుపోవడంతో కొన్ని హాస్పిటల్స్ ఈ పథకం కింద పేషెంట్లను తీసుకోవడమే మానేశాయని వివరించారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని నిలిపేస్తే అది పేద ప్రజలకు శరాఘాతంగా మారుతుందని హెచ్చరించారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ ఈ పథకాన్ని తీసుకువచ్చారని, రాష్ట్రంలో ఈ పథకం సక్సెస్ అయిందని వివరించారు. వైఎస్ రాజశేఖర్ తెచ్చిన పథకం ఆదర్శంగానే కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ స్కీమ్‌ను రూపొందించిందని వివరించారు. అలాంటి ఆరోగ్య శ్రీ పథకాన్ని నిలిపేసే సూచనలు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రూ. 1,600 కోట్లు బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# మంత్రి నారా లోకేశ్ ను కలిసిన అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్.



ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 30:అమెరికా కాన్సులేట్ జనరల్ (హైదరాబాద్) జెన్నిఫర్ లార్సన్ నేడు అమరావతి విచ్చేశారు. ఏపీ మంత్రి నారా లోకేశ్ తో ఆమె భేటీ అయ్యారు. జెన్నిఫర్ లార్సన్ తో భేటీపై నారా లోకేశ్ స్పందిస్తూ... అమెరికా కాన్సులేట్ జనరల్ తో సమావేశం సంతోషం కలిగించిందని తెలిపారు. భారతీయ అమెరికన్లలో తెలుగు ప్రజలు 14 శాతం మంది ఉన్నారని, వారు భారత్-అమెరికా మధ్య సంబంధాలను బలోపేతం చేశారన్న దాంట్లో తనకు ఎలాంటి సందేహం లేదని పేర్కొన్నారు. వారు తెలుగు సంస్కృతి, సంప్రదాయాల సొగసును అమెరికా గడ్డపై సుసంపన్నం చేశారని, మన వైవిధ్యాన్ని, వారసత్వాన్ని ఘనంగా చాటుతున్నారని లోకేశ్ వివరించారు. ఈ బంధాన్ని మరింత విస్తరింపజేయడంలో ఏపీ మరింత కీలకపాత్ర పోషిస్తుందని భావిస్తున్నామని తెలిపారు.

## అగ్ని బాధితులకు జనసేన నాయకుల రూ10 వేల ఆర్థిక సహాయం పంపిణీ



ఆంధ్ర ప్రగతి రుద్రవరం జులై 30: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శనివారం సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు జనసేన నాయకులు రూ 10 వేల ఆర్థిక సహాయము అందజేశారు. మంగళవారం ఆళ్లగడ్డ నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ ఇరిగెల రామ పుల్లారెడ్డి, జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులు తుడుం ప్రహ్లాదుడు కుటుంబ సభ్యులకు నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఇంచార్జ్ నాగ లింగమయ్య గౌడ్. నాయకులు గుర్రప్ప, చంటి ఓబయ్య, బన్నీ, విజయ్, జంబులయ్య, బాలస్వామి, సుంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

**-వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇబ్బందులు ఎదుర్కొన్నామని బాధితుల ఆవేదన.**
**-బాధితులకు నేనున్నానంటూ భరోసా ఇస్తున్న మంత్రి ఫరూక్.**





ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 30: సమస్యలు పరిష్కారం కాక వైసీపీ ఐదేళ్ల పాలనలో కష్టాలు, కన్నీళ్లతో కాలం వెళ్లదీసిన బాధితులకు న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ నిర్వహించిన "మన ఊరు ‐ మన బాధ్యత" కార్యక్రమంలో భరోసా ఇస్తున్నాడు . ప్రజల విన్నపాల పట్ల తక్షణమే స్పందిస్తున్న మంత్రి ఫరూక్ .. పలు సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని.. ప్రతిఒక్కరికి అండగా ఉంటామంటూ బాధితులకు భరోసా ఇస్తున్నారు. దీంతో తమ సమస్యలను, కష్టాలను విన్నవించేందుకు వందలాదిగా తరలివస్తున్నారు. టిడిపి కార్యాలయం లో నేరుగా మంత్రి ఫరూక్ ని కలిసి తమ కష్టాలను చెప్పుకుంటున్నారు. ప్రతి ఒక్కరిని నేరుగా కలిసిన మంత్రి.. వారి నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు.ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మంత్రి ఫరూక్ ని టిడిపి నాయకులు ఘనంగా సన్మానించుకున్నారు.

## ప్రధానోపాధ్యాయుడు పై దాడిని ఖండించిన విద్యార్థి సంఘాల నాయకులు.



ఆంధ్ర ప్రగతి పాణ్యం జూలై 30: నంద్యాల జిల్లా పాణ్యం మండలం బలపనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీ నారాయణ గారిని పరామర్శించిన సమాజ్వాది పార్టీ జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ యాదవ్ విద్యార్థి సంఘం నాయకుడు బత్తిన ప్రతాప్ సందర్భంగా వారు మాట్లాడుతూ బలపనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రహరీ గోడను ముగ్గురు విద్యార్థులు కలిసి పగలగొట్టిన సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మందలించడం జరిగింది. అందులో ఒక విద్యార్థి తండ్రి అయిన ఆర్ వెంకటేశ్వర్లు విధుల్లో ఉన్న ప్రధానోపాధ్యాయుడు శ్రీ నారాయణ పై దాడి చేయడం జరిగింది. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాము. దాడి చేసిన వారిపై కఠిన మైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. ప్రధానోపాధ్యాయడిని పరామర్శించడానికి ఏదైనా సందర్భంలో పాణ్యం మండలం ఎంఈఓ సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులు విద్యార్థి సంఘం నాయకులు, శ్రీరామ్,రాజు వేణు,విగ్నేష్, మధుసూదన్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వీడిన కిడ్నాప్ మిస్టరీ..

### రైస్ మిల్లర్ కు విముక్తి .

**-24 గంటల్లోనే కథ సుఖాంతం**
**-పోలీసుల అదుపులో కిడ్నాపర్**
**-మరో ఇద్దరు పరారీ**



ఆంధ్ర ప్రగతి గూడూరు జూలై 30:
కర్నూలు జిల్లా, గూడూరుకు చెందిన రైస్ మిల్లర్ వెంకటేశ్వరులు కిడ్నాప్ కేసును పోలీసులు ఛేధించారు. ముగ్గురు నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. వివరాల్లోకి వెళితే గూడూరుకు చెందిన వెంకటేశ్వర్లు సోమవారం రాత్రి తన రైస్ మిల్లు వద్ద ఉండగా ముగ్గురు వ్యక్తులు సుమో వాహనంలో వచ్చి అతని కిడ్నాప్ చేశారు. ఆ తర్వాత రూ. 3 కోట్లు ఇవ్వాలని వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను డిమాండ్ చేశారు. ఈ సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు కిడ్నాపర్ల కోసం గాలింపు చేపట్టారు. 24 గంటల లోపే కిడ్నాపర్లను గుర్తించారు. కిడ్నాప్ చెర నుంచి వెంకటేశ్వర్లును విడిపించారు. పోలీసుల సమాచారం మేరకు కిడ్నాపర్లు గూడూరు మండలం పొన్నకల్లు గ్రామానికి చెందిన కొండయ్య ,కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన గొల్ల వీరేష్, కర్నూలు చెందిన మున్నా భాష గా గుర్తించారు. అంతేకాదు కిడ్నాపర్లలో ఒకరిని పొన్నకల్ కొండయ్య ను పోలీసుల అదుపులో తీసుకున్నారు. ఈ కేసులో మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

# దోమల నివారణకు అధికారుల చర్యలేవి..?

**-సీజనల్ వ్యాధులపై ఆందోళన.**
**-వర్షాకాలం వచ్చిందంటే ప్రజలు హడల్.**
**-దోమల స్వైరవిహారంతో బెంబేలెత్తుతున్న ప్రజలు..**
**-పారిశుద్ధ్య లోపం..**
**మురుగునీరే కారణమా..?**
**-నివారణ చర్యలు శూన్యం.**



**ఆంధ్ర ప్రగతి మహానంది, జూలై 30:**

ప్రస్తుత వర్షాకాలంతోపాటు పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి.మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో గత కొన్ని రోజులు కురుస్తున్న వర్షాలకు పలు వార్డుల్లో అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచి దోమల బెడద అధికమైంది. పలు వార్డుల్లో ఖాళీ స్థలాలు, రోడ్లు, డ్రైనేజీల్లో మురుగునీరు నిలిచి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మురుగునీరు నుంచి భరించలేని దుర్వాసన వస్తుందని, దీంతో సీజనల్ వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు.దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పగలు రాత్రి అని తేడా లేకుండా జలగల్లాగా పట్టిపీడిస్తున్నాయి. పలు కాలనీల్లో ప్రజలకు కంటిమీద కునుకు కరువైంది. దోమల నివారణకు ప్రతి ఇళ్లల్లో కాయిల్స్, లిక్విడ్ సీసాల వినియోగానికి వందల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.అసలే వర్షాకాలం అపరిశుభ్రత ఆపై చీకటి పడితే చాలు ఏ వార్డుకి వెళ్ళినా దోమల మోత వినిపిస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి దోమల నివారణకు చరలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# కర్నూలు , నంద్యాల సోనా మసూరి బియ్యం ఎగుమతికి చర్యలు తీసుకోవాలి

**-పాణ్యం ఉద్యాన పూలతోటలు, నర్సరీలకు కేంద్రం ప్రోత్సహం ఇవ్వాలి.**
**-కేంద్ర వ్యవసాయ, పరిశ్రమల మంత్రులను కోరిన నంద్యాల ఎంపీ డా. బైరెడ్డి శబరి.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 30:
కర్నూలు , నంద్యాల సోనా మసూరి బియ్యం ఎగుమతికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, నంద్యాల జిల్లా పాణ్యం ఉద్యాన పూల తోటలకు, నర్సరీల ఆధునికరణ కోసం రైతులను కేంద్రం ప్రోత్సహించేందుకు కృషి చేయాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డా. బైరెడ్డి శబరి కోరారు.
గత ఐదేళ్లలో కర్నూలు సోనా, నంద్యాల సోనా మసూరి బియ్యం ఉత్పత్తికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూసిందని ఎంపీ తెలిపారు. మంగళవారం లోక్ సభలో కేంద్ర వ్యవసాయ, పరిశ్రమల శాఖ మంత్రుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లి మాట్లాడుతూ
2019 నుండి 2024 వరకు కర్నూలు, నంద్యాల సోనా ఉత్పత్తికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం వద్ద ఏమైనా డేటా వుందా అని కోరడం జరిగిందన్నారు. అదే విధంగా నంద్యాల జిల్లా పాణ్యం నర్సరీలకు ముఖ్యమైన ప్రాంతంగా ప్రభుత్వం గుర్తించిందా, ఉద్యాన పంటల సాగు అభివృద్ధికి ప్రోత్సహించిన వివరాలు, పాణ్యంలో నర్సరీ పరిశ్రమకు మద్దతు ఇవ్వడానికి, మెరుగుపరచడానికి ప్రభుత్వ రాయితీలు, పెట్టుబడులు, ఆధునిక పద్ధతిలో కొత్త వంగడాల ఉత్పత్తికి, అమలు అవకాశాల వివరించాలని కోరడం జరిగిందన్నారు.
రైతుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి వ్యవసాయ స్థాయి ఆర్థిక వ్యవస్థను (అంటే వ్యవసాయ లాభాలు) పెంపొందించడం వ్యవసాయ శాఖ యొక్క లక్ష్యాలలో ఒకటి అని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొనడం జరిగిందని తెలిపారు.ప్రస్తుతం, ఆంధ్రప్రదేశ్‌లోని 5 జిల్లాలతో సహా 25 రాష్ట్రాల్లోని



194 గుర్తించబడిన జిల్లాల్లో ఎన్ ఎఫ్ ఎస్ ఎం-రైస్ కార్యక్రమం అమలు చేయబడుతోందని, ఎన్ ఎఫ్ ఎస్ ఎం-వరి కార్యక్రమం కింద, క్లస్టర్ ఫ్రంట్ లైన్ ప్రదర్శనలు/క్రాపింగ్ సిస్టమ్ ఆధారిత ప్రదర్శనల ద్వారా తాజా పంట ఉత్పత్తి, రక్షణ సాంకేతికతలు ప్రచారం చేయబడుతున్నాయని వీటిలో కొత్తగా విడుదలైన రకాలు/సంకరజాతులు, ఒత్తిడిని తట్టుకునే/వాతావరణాన్ని తట్టుకోగల రకాలు, బయో-ఫోర్టిఫైడ్ రకాలు ఉన్నాయన్నారని తెలిపారు. ఐఎన్ఎం ఐపిఎం పద్ధతులు, నీటి సమర్ధవంతమైన వినియోగం కోసం నీటి పొదుపు పరికరాలను ప్రోత్సహించడం, సాంస్కృతిక కార్యకలాపాల కోసం మెరుగైన వ్యవసాయ పనిముట్లు/సాధనాలు, రైతుల సామర్థ్యాన్ని పెంపొందించడంపై కూడా దృష్టి కేంద్రీకరించబడిందని తెలిపారన్నారు. ఎన్ ఎఫ్ ఎస్ ఎం-వరి కార్యక్రమం కింద రైతుల సామర్థ్యం, పెంపుదల కింద పంట ఉత్పత్తి పద్ధతులు, అవగాహనపై శిక్షణ ఇవ్వబడుతుందన్నారన్నారు. వ్యవసాయం రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద రాష్ట్ర నిర్దిష్ట అవసరాలు/ప్రాధాన్యాల కోసం రాష్ట్రాలకు సౌలభ్యాన్ని అందిస్తుందని తెలిపారన్నారు. మసూరి బియ్యం యొక్క ప్రత్యేక ఉత్పత్తి డేటాను వ్యవసాయం %ఁ% రైతుల సంక్షేమ శాఖ నిర్వహించదు కానీ ఉత్పత్తి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నివేదించిన ప్రకారం గత 5 సంవత్సరాలుగా మసూరి బియ్యం ఈ క్రింది విధంగా ఉందన్నారు. లక్ష మెట్రిక్ టన్‌లలో మసూరి బియ్యం ఉత్పత్తి అయిందన్నారు.
ఆంధ్ర ప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా పాణ్యం మండల ఉద్యానవన, పూల పెంపకం నర్సరీలకు మంచి అవకాశాలను కలిగి ఉందని, ఈ ప్రాంతంలోని మెజారిటీ వరి రైతులు ఈ నర్సరీల ద్వారా తమ ఆదాయాన్ని భర్తీ చేసుకుంటున్నారన్నారు. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్, కేంద్ర ప్రాయోజిత పథకం 2014-15, పండ్లు, కూరగాయలు, వేరు మరియు దుంప పంటలు, పుట్టగొడుగులు, సుగంధ ద్రవ్యాలు, పువ్వులు, సుగంధ మొక్కలు, కొబ్బరి, జీడి, కోకో మరియు వెదురుతో కూడిన ఉద్యాన రంగం యొక్క సమగ్ర వృద్ధికి. అన్ని రాష్ట్రాలు మరియు యు టిలు ఎమ్ఐడిహెచ్ పరిధిలోకి వస్తాయని, నాణ్యమైన విత్తనాలు, నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, పంపిణీ కోసం ఖర్చుతో కూడిన పండ్ల పంటల నాటడం కోసం కొత్త హైటెక్ నర్సరీలు, చిన్న నర్సరీలు, టిష్యూ కల్చర్ యూనిట్లు, ఇప్పటికే ఉన్న టిసి యూనిట్లను అప్‌గ్రేడ్ చేయడానికి ఎం ఐ డి జి హెచ్ కింద సహాయం అందించబడుతుందని కేంద్ర వ్యవసాయ మంత్రి తెలిపినట్లుఎంపి బైరెడ్డి శబరి వివరించారు

## సీఎం చంద్రబాబు శ్రీశైలం పర్యటనను విజయవంతం చేయండి

### -అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ - శ్రీమతి జి. రాజకుమారి గణియా.

ఆంధ్ర ప్రగతి శ్రీశైలం/ నంద్యాల, జులై 30:
ఆగస్టు 1వ తేదీన శ్రీశైలమహాక్షేత్రానికి విచ్చేయనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లాలోని అధికారులను ఆదేశించారు. మంగళవారం అన్నపూర్ణ ప్రసాద వితరణ భవనసముదాయంలో గల సీసీ కంట్రోల్ రూమ్ నందు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్, జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజుతో కలిసి సి.యం ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీశైల క్షేత్ర పర్యటన పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేసి విజయవంతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 1వ తేదీ ఉదయం 9.50



గంటలకు సున్నిపెంట హెలిప్యాడ్ చేరుకొని అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల దర్శనం, శ్రీశైల ప్రాజెక్టుకు వద్ద జలహారతి కార్యక్రమము, కుడిగట్టు జలవిద్యుత్ కేంద్ర సందర్శన, ( ఏ.పి. జెన్‌కో) , సున్నిపెంటలోని వాటర్ యూజర్స్ అసోసియేషన్ వారితో ముఖాముఖి చర్చాగోష్టి మొదలైన అంశాలను వివరిస్తూ ఏర్పాట్లపై జిల్లా అధికారులను దిశానిర్దేశం చేశారు. హెలిప్యాడ్ వద్ద పారిశుద్ధ్యం ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. అదేవిధంగా శ్రీశైలం ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో ముఖ్యంగా దృశ్య కేంద్రాల వద్ద పారిశుద్ధ్యం ఏర్పాట్లు సమగ్రంగా ఉండాలన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘం సభ్యులతో రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించే ప్రదేశంలో సభావేదిక, కార్యక్రమ నిర్వహణ, ముఖాముఖి, ఇష్టాగోష్టి తదితర అంశాల గురించి పలు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమానికి వచ్చే సాగునీటి వినియోగదారుల సంఘ సభ్యులతో తగు విధంగా మంచినీరు, స్నాక్స్ ఏర్పాట్లు ఉండాలన్నారు. అదేవిధంగా సభా కార్యక్రమము జరిగే చోట వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యశాఖ సిబ్బందిని అదేశించారు. సభావేదిక వద్ద ముఖ్యమంత్రి ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఏర్పాట్లు కూడా చేయాలన్నారు. అనంతరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు ఆలయ దర్శనం, ఆలయంలో పూజాదికాల తదితర అంశాల గురించి వివరించారు.

## ఎలక్ట్రిషన్ అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ కిరణ్ ని

# విధుల నుంచి తొలగించాలి

ఆంధ్ర ప్రగతి జమ్మలమడుగు జులై 30:
జమ్మలమడుగు పట్టణంలోని మైలవరం గవర్నమెంట్ ఐటిఐ కళాశాల నందు రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు, ఈ సందర్భంగా రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ, మైలవరం గవర్నమెంట్ ఐటిఐ కళాశాల నందు గత మూడు సంవత్సరాలుగా ఎలక్ట్రిషన్ అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్నారు ఐతే కిరణ్ గారు విద్యార్థులను కళాశాలకు రండి అని చెప్పకుండా రాకపోయినా ఇబ్బంది లేదు ఎగ్జామ్ రాపిస్తాము డబ్బు పెట్టు పట్టా బట్టు అనే నినాదంలో వ్యవహరిస్తూ విద్యార్థుల దగ్గర అటెండెన్స్ షార్ట్ ఏజ్ ఫీజ్ అని విద్యార్థుల దగ్గర 5000 నుండి పది వేల వరకు వసూలు చేస్తూ ధనార్జన ధ్యేయంగా చేసుకొని నిర్ధాక్షణంగా విద్యార్థులను మోసం చేస్తున్నారని వారు విమర్శించారు, విద్యార్థులకు రికార్డ్స్ పేరుతో వాటి



కాస్ట్ 500 ఉంటే 2000 వేలు వరకు వసూలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు, ఎగ్జామ్స్ టైం లో క్యాఫీల్ జరపాలి లేదంటే మీరు పాస్ కాలేరు అని ప్రతి విద్యార్థి దగ్గర 2000 వసూలు చేస్తున్నారని వారు విమర్శించారు,వీరు గత మూడు సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తున్నారు గత మూడు సంవత్సరాలుగా 10 లక్షల వరకు వసూలు చేశారని వారు తెలియజేశారు,వీటన్నిటికీ కారణం ఆ ఐటిలో ప్రిన్సిపల్ లేకపోవడం ఇంచార్జ్ ప్రిన్సిపాల్ తో కొనసాగుతున్నందున ఇవన్నీ ఇన్చార్జి ప్రిన్సిపల్ నవరూప్ కనుసన్నులలో జరుగుతున్నాయని అన్ని తెలిసి కూడా నాకేం తెలియదు అన్నట్లుగా వ్యవహరిస్తు విద్యార్థుల దగ్గర మీరు పాస్ కావాలంటే డబ్బు కట్టాలి అనే మామూళ్ల మత్తులో మునిగిపోయి ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ను అభివృద్ధి పథంలో కాకుండా భ్రస్టు పట్టిస్తున్నారని వారు తెలియజేశారు, తక్షణమే జిల్లా కలెక్టర్ ఆర్డిడి పైన తెలిపిన వారిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి విద్యార్థుల దగ్గర గత కొన్ని సంవత్సరాలుగా ఎంత డబ్బులు వసూలు చేశారు ఆ డబ్బును విద్యార్థులకు రిటర్న్ ఇచ్చే రట్లుగా చర్యలు తీసుకొని వారిని విధుల నుంచి తొలగించాలని ఈ సందర్భంగా రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆర్ఎస్ఓ గా విన్నవించుకుంటున్నాం ఈ కార్యక్రమంలో రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ నాయకులు లింగమయ్య, బాబు ,చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో

# పిచ్చి మొక్కలు గుంతల మయం

### సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 30:
నంద్యాల నూతనంగా జిల్లా ఏర్పడిన తర్వాత తాత్కాలికంగా కలెక్టర్ కార్యాలయాన్ని అధికారులు నడుపుతున్నారు గాని ఆ కార్యాలయానికి వేల సంఖ్యలో సమస్యలతో కలెక్టర్ కార్యాలయానికి జనాలు రావడం జరుగుతుంది.కానీ అధికారులు కలెక్టర్ కార్యాలయం చుట్టూ ఉన్న ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడం మరిచిపోయారు రహదారులలో గోతులు వర్షపు నీరు నిలుచుని దోమలు మురికి నీరు చెట్లు చెదారంతో నిండి ఉంది ఇప్పటికైనా అధికారులు ఆ ప్రాంతాలలో గ్రావెల్స్ తోలి పిచ్చి మొక్కలను తొలగించి నిలిచిన నీటిని తొలగించి శుభ్రపరిచి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా తెలియజేయడం జరుగుతుంది.

## మహానందీశ్వరుని సేవలో ఏపీ ఎన్జీవోస్ జనరల్ సెక్రెటరీ పూజలు.



ఆంధ్ర ప్రగతి మహానంది, జూలై 30:మహానంది పుణ్యక్షేత్రంలో మంగళవారం ఎన్జీవోస్ జనరల్ సెక్రెటరీ పురుషోత్తమ నాయుడు, కార్యవర్గ సభ్యులు పూజలు నిర్వహించారు. ముందుగా వీరికి ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు స్వాగతం పలికారు.శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని, అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం ఆలయ అధికారులు శేష వస్త్రాలతో సత్కరించిగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.వీరి వెంట నంద్యాల, కర్నూలు జిల్లా అధ్యక్షులు వెంగళ రెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## కామేశ్వరి అమ్మవారికి పుట్టింటి సారె

ఆంధ్ర ప్రగతి మహానంది, జూలై 30:
మహానంది పుణ్యక్షేత్రంలో వెలిసిన శ్రీ కామేశ్వరి దేవి అమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా పుట్టింటి సారెను సమర్పించారు. మంగళవారం మహానంది గ్రామానికి చెందిన మహిళలు,భవనాశి రమణయ్య, ఎల్లయ్య దంపతులు, దేవస్థానం మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లిఖార్జున దంపతుల ఆధ్వర్యంలో కామేశ్వరీ అమ్మవారికి ఆషాఢ మాసపు పుట్టింటి సారె,వడి



బియ్యం కార్యక్రమం నిర్వహించారు. వీరికి ముందుగా మేళతాళాలు,వేదమంత్రాల నడుమ ఆలయ అధికారులు, వేద పండితులు రవిశంకర్ అవధాని స్వాగతించారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ద్వారా పట్టువస్త్రాలు, సౌభాగ్య ద్రవ్యాలను భక్తితో సమర్పించినారు.అనంతరం ఆలయ వేదపండితులు, ప్రధానార్చకులు, అర్చకులు వీరికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనాలు అందించారు.

## సమాధి రాళ్లపై వేసుకున్నట్లుగా సర్వే రాళ్లపై జగన్ ఫొటోలు వేయించాడు.! - మంత్రి అచ్చెన్నాయుడు.

ఆంధ్రప్రభ అమరావతి జూలై 30:
సమాధి రాళ్లపై ఫొటోలు వేసుకున్నట్లుగా సర్వే రాళ్లపై జగన్ ఫొటోలు వేయించారని ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. రైతుల పొలాల్లో సర్వే రాళ్లపై జగన్ తన ఫొటోలు వేయించుకోవడం విడ్డూరమన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మంత్రి ట్వీట్ చేశారు.'రైతు



తన పొలంలో దిష్టిబొమ్మ పెట్టడానికి ఒప్పుకుంటాడు కానీ పొలం హక్కు పుస్తకాల మీద దిష్టిబొమ్మ పెడితే ఊరుకోడు.. సమాధి రాళ్ల మీద ఫోటో వేసుకున్నట్లు రైతులందరి పొలాల్లో సర్వే రాళ్లపై నీ (జగన్) ఫొటోలు వేయించావు. ప్రజల సొమ్ము రూ.650 కోట్లతో సర్వే రాళ్లపై బొమ్మలు వేసి పబ్లిసిటీ స్టంట్లు చేసినందుకే నిన్ను ఇంటికి పంపించారు.' అంటూ జగన్‌ను ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు.ఫొటోల పిచ్చి ఖరీదు రూ.700 కోట్లు' అని రాష్ట్ర ప్రభుత్వం నిగ్గు తేల్చిందని ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని పోస్ట్ చేశారు. గ్రానైట్ రాళ్లపై జగన్ ఫొటోల కోసం వైసీపీ ప్రభుత్వం చేసిన ఖర్చు ఇది అంటూ ఆ కథనం పేర్కొంది. నాటి వైసీపీ ప్రభుత్వం చేష్టలకు అధికారులు దాసోహం అన్నారని విమర్శించింది. అధికారులు ఏమాత్రం అడ్డు చెప్పకుండా నిధులు ఖర్చు చేశారని ఆరోపించింది. దీనిని అచ్చెన్నాయుడు పోస్ట్ చేస్తూ విమర్శలు గుప్పించారు.

## ఆగస్టు 1న శ్రీశైలం కు సీఎం చంద్రబాబు..

# ఏర్పాట్లను సమీక్షించిన జిల్లా కలెక్టర్

. ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 30:
ఆగస్టు ఒకటో తేదీన శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించనున్న ఏపీ సీఎం నారాచంద్రబాబు నాయుడు పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను నంద్యాల జిల్లా కలెక్టర్ జీ రాజకుమారి ఆదేశించారు.మంగళవారం అన్నపూర్ణ ప్రసాద వితరణ భవన సముదాయంలోని సీసీ కంట్రోల్ రూమ్‌లో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్, జాయింట్ కలెక్టర్ సీ విష్ణుచరణ్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి డీ పెద్దిరాజుతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జీ రాజకుమారి మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు శ్రీశైల క్షేత్ర పర్యటన పర్యటనకు ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు ఒకటో తేదీ ఉదయం 9.50 గంటలకు సీఎం చంద్రబాబు సున్నిపెంట హెలిప్యాడ్ చేరుకుంటారని తెలిపారు. అటుపై శ్రీస్వామి అమ్మవార్ల దర్శనం చేసుకుంటారన్నారు. శ్రీశైల ప్రాజెక్టుకు వద్ద జలహారతి కార్యక్రమం, కుడిగట్టు జలవిద్యుత్ కేంద్ర (ఏపీ జెన్‌కో) సందర్శన, సున్నిపెంటలోని వాటర్ యూజర్స్ అసోసియేషన్ వారితో ముఖాముఖి చర్చాగోష్టిలో సీఎం పాల్గొంటారని వివరించారు. హెలీప్యాడ్, శ్రీశైలం



ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో సమగ్ర ఏర్పాట్లు చేయాలని అధికారులను రాజకుమారి ఆదేశించారు. సాగునీటి వినియోగదారుల సంఘం సభ్యులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి సభావేదిక, కార్యక్రమ నిర్వహణ, ముఖాముఖి, ఇష్టాగోష్టి చర్చల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజకుమారి పలు ఆదేశాలు జారీ చేశారు. సభా వేదిక వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యశాఖ సిబ్బందిని అదేశించారు. సీఎం ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు సభావేదిక వద్ద ఏర్పాట్లు కూడా చేయాలన్నారు. ఆలయ దర్శనం, ఆలయంలో పూజాదికాలు తదితర అంశాల గురించి దేవస్థానం ఈఓ డీ పెద్దిరాజు వివరించారు.

# రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించండి...

**రాక్షస పాలనకు చమగీతం పాడండి..ఇచ్చిన హామీలను నెరవేర్చండి.**
**-వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు, కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాష.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 30:**

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 55 రోజులు పూర్తి అయ్యాయని, ఈ కాలంలో వారు రాష్ట్రంలో రాక్షస పాలన సాగించారని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కక్షపూరిత రాజకీయాలను చేస్తూ ప్రశాంత వాతావరణం లేకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారని ఇప్పటికైనా టిడిపి కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సాధించి ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని నంద్యాల జిల్లా వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ,ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా కోరారు. మంగళవారం నంద్యాల జిల్లా కేంద్రంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి టిడిపి కూటమి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాటినుండి ఇప్పటివరకు చేసిన వాటిపై స్పందించడం జరిగింది. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... టిడిపి కూటమి



ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారం చేపట్టి 55 రోజులు కావస్తుందని, ఈ కాలంలో హత్యలు, దౌర్జన్యాలు, అరాచక పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా టిడిపి కూటమి పార్టీ ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేదని పూర్తి బడ్జెట్ ప్రకటించలేదని కేవలం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ తో సరిపెట్టారని అన్నారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారం చేపట్టి ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను తూచా తప్పకుండా నెరవేర్చడం జరిగిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం దౌర్జన్యాలు, హత్య రాజకీయాలు, రెడ్ బుక్ పాలన సాగిస్తున్నారని అన్నారు. ప్రజలు గత ప్రభుత్వం, ప్రస్తుత అధికార ప్రభుత్వం చేసిన అభివృద్ధి, పరిపాలన, పనితీరును గమనించాలని కోరారు. కుల మతాలకు అతీతంగా అర్హులదరికి పథకాలను అందించామన్నారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్నదని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో అరాచకాలు, దౌర్జన్యాలు లేకుండా పరిపాలన సాగించాలని కోరారు. ఎమ్మెల్సీ ఇస్సాక్ భాష మాట్లాడుతూ... రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలుపరుస్తున్నట్లుగా ఉన్నదని, కక్ష సాధింపు, రాక్షస పరిపాలన చేస్తున్నదని విమర్శించారు. హత్యలు, ఆస్తుల విధ్వంసం, ప్రభుత్వ ఆస్తులను నష్టపరచడం, దౌర్జన్యాలు వీటన్నిటిపై దృష్టి సారించిందని, ఆంధ్ర ప్రదేశ్ చరిత్రలో ఈ విధంగా ఎన్నడూ జరగలేదని పేర్కొన్నారు. లా అండ్ ఆర్డర్ అదుపు తప్పిందని అన్నారు . సాక్షాదారాలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో ఫోటోలతో ప్రదర్శించడం జరిగిందని తెలిపారు . వీటన్నిటిని చూసైనా ఏపీ హోం మినిస్టర్ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. లా అండ్ ఆర్డర్ నియంత్రణ ప్రభుత్వం యొక్క బాధ్యత అని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక, రాక్షస పరిపాలన సభ్య సమాజం, మానవ సమాజం అసహ్యించుకుంటున్నదని అన్నారు. ఇప్పటికైనా దహనకాండ, రాక్షసక్రీడలు మానుకోవాలని, ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలుపరచాలని, రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు సూర్యనారాయణ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డా. శశికళ రెడ్డి, సాయిరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.